
మాట తప్పకూడదు



తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికి ఇస్తామని ఎన్నికల హామీలో మాట చంద్రబాబు తప్పకూడదు. నాకు ఇద్దరు సంతానం. ఒకరు ఇంటర్, ఒకరు 9వ తరగతి చదువుతున్నారు. నా ఇద్దరు పిల్లలకు కలిపి రూ.30 వేలు ఇవ్వాలి. లేకపోతే చంద్రబాబును జన్మలో నమ్మము. -లక్ష్మీదేవి, నాయునిపల్లె, కాశినాయన మండలం





'అమ్మ ఒడి పథకంలో సమూల మార్పులు తీసుకువస్తాం. ఎంతమంది విద్యార్థులంటే అందరికీ 'తల్లికి వందనం' పేరిట ద్వారా రూ.15వేలు చొప్పన చెల్లిస్తాం. ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే రూ.30వేలు, ముగ్గురుంటే రూ.45వేలు చెల్లిస్తాం..'
-మే 2వ తేదీన కడప ఏడురోడ్ల కూడలి సభలో చంద్రబాబు

తల్లికి వందనం
పిల్లలకు బంధనం

- ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లి వందనం అన్నారు
- మేనిఫెస్టోలో చేర్చి ఊదరగొట్టారు
- అధికారంలోకి వచ్చాక ఒక్కరికే అంటున్నారు
- ఇదేం పద్ధతి బాబూ అంటూ.. తల్లిదండ్రుల మండిపాటు

ప్రొద్దుటూరు/ప్రొద్దుటూరు కల్చరల్/ రాజుపాళెం/ కాశినాయన /అట్లూరు/బద్వేలు అర్బన్ : ఎన్నికల వాగ్దానాలు నిలబెట్టుకోవడం తమకు చేతకాదని టీడీపీ ప్రభుత్వం మరోసారి రుజువు చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన జగనన్న అమ్మఒడి పథకానికి ధీటుగా తల్లికి వందనం అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. అధికారంలోకి వస్తే ప్రతి ఇంట్లో చదువుకుంటున్న పిల్లలందరికి తల్లికి వందనం పథకం ద్వారా రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పిన కూటమి నేతల హామీ కోతలకే పరిమితమైంది. విద్యార్థులు ఎంత మంది ఉన్నా తల్లికే ఆర్థిక సహాయం అంటూ సీఎం చంద్రబాబు మెలిక పెట్టారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలపై నీళ్లు చల్లారు. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబానికి ఏడాదికి రూ.45 వేలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో పదే పదే చెప్పారు.

నాలుగేళ్లలో రూ.60 వేలు ఆర్థిక సాయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.60 వేలు ఆర్థిక ప్రోత్సాహం జమ చేసింది. 2019–20 విద్యా సంవత్సరం మొదలుకుని ఇప్పటి వరకు క్రమం తప్పకుండా అమ్మఒడి సాయం అందింది. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి ఉంటే గత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఐదవ విడత అమ్మఒడి నిధులు జూన్ 21న తల్లుల ఖాతాల్లో జమ అయ్యేది. ఆచరణకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఐదవ విడత అమ్మఒడి ఆర్థిక ప్రోత్సాహం విషయంలో ఆశలు రేపి ఆవిరి చేసింది.

ప్రొద్దుటూరు మండలంలో..

ప్రొద్దుటూరు మండలంలో 112 ప్రభుత్వ మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా వీటిలో 82 ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత, 21 ఉన్నత పాఠశాలు ఉండగా వీటిలో దాదాపు 14,365 మంది చదువుతున్నారు. అలాగే 121 ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలు ఉండగా 36 ప్రాథమిక పాఠశాలు, 29 ప్రాథమికోన్నత, 56 ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో 27,309 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మొత్తం 233 పాఠశాలలకు గాను 41,674 మందిపైగా విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యార్థుల్లో అర్హులైన వారందరికి తల్లికివందనం పతకం కోసం వేచిచేస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను ఎంతవరకు నిలబెట్టుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

తరగతుల వారీగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు 1వ తరగతి–2,410, 2వ తరగతి– 3,643, 3వ తరగతి– 3,811, 4వ తరగతి–4,410, 5వ తరగతి– 4,733, 6వ తరగతి–4,838, 7వ తరగతి–4,702, 8వ తరగతి–4,506, 9వ తరగతి–4,072, 10వ తరగతి–3,979 మందికి తరగతుల వారిగా విద్యార్థుల తల్లులకు తల్లికి వందనం రావలసి ఉంది.

రాజుపాళెం మండలంలో..

రాజుపాళెం మండలంలో 28 ప్రైమరీ, రెండు యూపీ, 8 జెడ్పీ హైస్కూళ్లు, మూడు ప్రైవేటు, ఒకటి బాలయోగి బాలికల గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 4,471 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

తల్లికి వందనం అందేనా...?

ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికి తల్లికి వందనం పేరిట రూ.15 వేలు చొప్పున ఇస్తామని కూటమి నేతలు మేనిఫెస్టోలో పొందుపరిచారు. ఆ మేరకు ఎన్నికల సమావేశాల్లో ఇదే అంశాన్ని ఊదరగొట్టారు. అయితే అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే కూటమి ప్రభుత్వం మాట మార్చింది. ఇంటిని యూనిట్‌గా తీసుకుని ఓ తల్లికి మాత్రమే పథకం వర్తిస్తుందని జీవో జారీ చేసింది. అంతేకాకుండా 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని, ఆ కుటుంబం దారిద్ర్యరేఖకు దిగువన ఉండాలని జీవోలో స్పష్టం చేసింది. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం పథకాన్ని అమలు చేస్తారా లేదా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉంటున్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో బద్వేలు నియోజకవర్గానికి సంబంధించిన అమ్మ ఒడి పొందిన వారి వివరాలు

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	జమచేసిన మొత్తం
2019–20	25802	34.83.27000
2020–21	25956	35.40.06000
2021–22	26258	35.44.83000
2022–23	26467	35.73.04500
మొత్తం	104483	141.41.20000

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించిన అమ్మ ఒడి పొందిన వారి వివరాలు

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	మొత్తం (రూపాయలలో)
2019–20	22,778	34,16,70,000
2020–21	24,319	34,04,66,000
2022–23	23,877	31,04,01,000
2023–24	23,670	30,08,94,329

త్వరగా ఇస్తే ఉపయోగం



గతంలో అమ్మఒడి పథకం కింద ఒక్కరికే ఇచ్చే రూ.15 వేలు పాఠశాలల ప్రారంభం సమయంలోనే ఇవ్వడంతో ఉపయోగంగా ఉండేది. నాకు హర్షిత, వర్షిత అనే ఇద్దరు కవల పిల్లలు. జెడ్పీ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం ఇద్దరికి కలిపి రూ.30 వేలు వస్తాయని ఎదురుచూస్తున్నాను. ఇచ్చేది ఏదో త్వరగా ఇస్తే ఉపయోగం ఉంటుంది.
– పి.వసంత, ఇన్సాఫ్‌నగర్, బద్వేలు

మాట తప్పిన ముఖ్యమంత్రి



మాది బి.మఠం మండలం లింగాలదిన్నెపల్లె. మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు ఒకరు 10 వతరగతి, మరొకరు 8వ తరగతి, కుమార్తె 6 వతరగతి చదువుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చదువుకునే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15 వేలు ప్రకారం ఎంతమంది ఉంటే అంతమందికి తల్లి వందనం పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ముగ్గురు పిల్లలకు రూ. 45 వేలు వస్తుందని అనుకున్నాను. ఇప్పుడు ఒకరికే ఇస్తామని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట తప్పడం సరికాదు.
–భూమిరెడ్డి లక్ష్మిదేవి, లింగాలదిన్నె పల్లె, బి.మఠం మండలం

అందరికి ఇస్తే బాగుంటుంది



నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. ముగ్గురు రాజుపాళెం, వెల్లాల, చాగలమర్రి గ్రామాల్లోని పాఠశాలల్లో చదువుతున్నారు. తల్లికి వందనం పథకం పేరుతో ఇంటిలో ఎంత మంది చిన్నారులు ఉంటే అందరికి వస్తుందని అన్నారు. కానీ ఒకరికి మాత్రమే రూ.15వేలు ఇస్తారని అంటున్నారు. చెప్పిన మాట ప్రకారం ముగ్గరికి ఇస్తే ఆర్థికంగా ఆదుకున్నట్లు అవుతుంది. చదువుకుంటున్న పిల్లందరికి తల్లికి వందనం పథకం అందిస్తే బాగుటుంది. -జ్యోతి, గోపాయపల్లె, రాజుపాళెం మండలం

ఒకరికే ఇస్తామడం సరికాదు



నాపేరు మణ్యం సునంద అట్లూరు మండలం మణ్యంవారిపల్లి గ్రామం చంద్రబాబు మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం కుటుంబంలో పిల్లలందరికీ తల్లికి వందనం అమలు చేయాలి. మాకు ఇద్దరు పిల్లలు. వీరు ప్రైవేటు స్కూల్లో చదువుతున్నారు. ఇద్దరి పిల్లలకు తల్లికి వందనంతో రూ.30 వేలు వస్తాయని అనుకున్నాము. ఒక్కరికే ఇస్తారని అంటున్నారు. ప్రభుత్వం నిర్ణయం మనస్థాపానికి గురిచేసింది. -మణ్యం సునంద. మణ్యంవారిపల్లి. అట్లూరు మండలం.

ఇచ్చిన మాట నిలుపుకోవాలి



మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్దబ్బాయి 10వ తరగతి, రెండవ అబ్బాయి 8 వ తరగతి చదువుతున్నారు. వ్యవసాయ చేసుకుని జీవనం సాగిస్తూ ప్రైవేటు పాఠశాలలలో చదివించలేక ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నాము. ఇద్దరు పిల్లలకు రూ.30 వేలు వస్తుందని అనుకున్నాం కానీ ముఖ్యమంత్రి మాటమార్చి ఒక్కరికే రూ.15 వేలు ఇస్తామడం మంచిది కాదు.
–రొంఢా లక్ష్మీదేవి. కుంభగిరి. అట్లూరు మండలం

మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికల సమయంలో కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నిలబెట్టుకోవాలి. నాకు నలుగురు పిల్లలు. కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం తల్లికి వందనం పథకం కింద రూ.60 వేలు రావాలి. తల్లికి వందనం నగదు వెంటనే జమ చేస్తే ఫీజులు చెల్లిస్తాం.
బి.రాధమ్మ, మార్తోమానగర్, బద్వేలు

నగదు కోసం ఎదురుచూస్తున్నాం



నాకు ఇద్దరు పిల్లలు. పిల్లలు మాలాగా కష్టపడకూడదని కష్టమైనా ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నాం. గతంలో జగనన్న ప్రభుత్వం అమ్మఒడి కింద ఇచ్చిన ఆర్థిక సాయం అందించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు చొప్పున వేస్తామని చెప్పారు. రూ.30 వేలు ఎప్పుడు జమ చేస్తారా అని ఎదురుచూస్తున్నాము.
– పొట్టిపాటి జయమ్మ, మార్తోమానగర్, బద్వేలు

మా బాధలు అర్థం చేసుకోవాలి



నా భర్త చాలా ఏళ్ల క్రితం మృతిచెందాడు. పిల్లలకు ఏ కష్టం రాకూడదని పాచిపని చేసుకుంటూనే నా ఇద్దరు పిల్లలను ప్రైవేటు స్కూల్‌లో చదివిస్తున్నాను. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం డబ్బులు వేస్తామని చంద్రబాబు చెప్పడంతో ఆశగా ఎదురుచూస్తున్నాను. స్కూళ్ల ప్రారంభించి నెల రోజులు అవుతోంది. ఫీజులు కట్టమని ఒత్తిడి చేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం డబ్బులు వేసి ఆదుకోవాలి.
-బద్దలరామలక్షుమ్మ, వెంకటేశ్వరనగర్, బద్వేలు

హామీని విస్మరించడం తగదు



ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికి షరతులు లేకుండా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి. ఇంటిలో ఎంత మంది చదువుతుంటే అందరికి ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ స్పష్టంగా చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని విస్మరించడం తగదు.
– ములపాకు ప్రతాప్‌రెడ్డి, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.

మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఎన్డీఏ కూటమి నేతలు కలిపి ఇచ్చిన ప్రతి హామీని నిలుపుకోవాలి. అప్పుడే ప్రజల్లో నమ్మకం ఏర్పడుతుంది. విద్యకు ప్రాధాన్యత ఇచ్చి చెప్పిన ప్రకారం తల్లికి వందనం కార్యక్రమాన్ని చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. తల్లికి వందనం పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలి.
– కె.సత్యనారాయణ, సీపీఎం పట్టణ కార్యదర్శి, ప్రొద్దుటూరు.

ఐదుగురు జూదరుల అరెస్టు

రాజుపాళెం: మండలంలోని వెలవలి గ్రామంలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశామని రాజుపాళెం ఇన్‌చార్జి ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం పక్కా సమాచారంతో సిబ్బందితో కలసి అరెస్ట్‌చేశామని పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో ప్రొద్దుటూరు వ్యక్తులు ముగ్గురు, ఒకరు చెన్నమరాజుపల్లె, మరొకరు టంగుటూరుకు చెందిన వారిగా గుర్తించామని తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.7,130 నగదు, 7 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు, ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు 10 మంది ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీకి గురుసుష్మ, బిందు, మనోజ్‌కుమార్, నాగగణేష్, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి కీర్తన, సిరి, గోవిందిని, భార్గవి, గురు, ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి భువన చంద్రిక ఎంపికయ్యారు. తమ పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు హర్షం వ్యక్తం చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

మైదుకూరు : విలేజ్ వార్డు సెక్రటేరియట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మైదుకూరు శాఖ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా బోరెడ్డి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.నరసింహాప్రసాద్, ఉపాధ్యక్షులుగా పి.వెంకటయ్య, కల్పన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా సహాయ కార్యదర్శులుగా హర్షవర్ధన్ రాజు, ఖాజావలి, కోశాధికారిగా బాల బ్రహ్మం ఎన్నికయ్యారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

చాపాడు: మైదుకూరు నియోజకవర్గంలో కేసీ ఆయకట్టు సాగునీటి ఆధారమైన రాజోలి ఆనకట్ట నిర్మించడంతో పాటు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం మండల అధ్యక్షులు టి.లక్షుమయ్య అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రహంతుల్లయ్య, ఉప ఎంపీపీ శుభకరుణమ్మ, డీటీ ప్రవీణ్, ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, వెలుగు ఏపీఎం వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ విస్మరించిన టీడీపీ నాయకులు

మండల సర్వ సభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రమే ప్రజల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. సభలో ఇతరులు లోపలికి రావద్దని ఓ వైపు ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ చెబుతున్నప్పటికీ టీడీపీ నాయకులు సభలో కూర్చుని పలు సమస్యలను సభ దృష్టికి తీసువచ్చారు. అయితే ఎమ్మెల్యే, ఎంపీపీ, అధికారులు మాత్రంలో ప్రొటోకాల్‌ను పట్టించుకోకపోవటం గమనార్హం.

దువ్వూరు : దువ్వూరు మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం మండల ఉపాధ్యక్షురాలు పీరుజాత రహమతున్నీసా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా దువ్వూరు మండలాన్ని అభివృద్ధి చేద్దామని, అందుకు ఇక్కడున్న ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సహకరించాలని కోరారు. ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



సునీల్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : మిడుతూరు గ్రామంలో డయేరియా పూర్తిగా తగ్గే వరకు వైద్య సేవలు అందించాలని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సూచించారు. మిడుతూరు గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయన బాధితులను పరామర్శించారు. డయేరియాకు కారణమైన నీటిని వెంటనే ఆపేయాలని అందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఆర్థిక సహాయం

డయేరియాతో మృతి చెందిన సునీల్ (19) కుటుంబాన్ని రఘురామిరెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని రూ. 30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను, ప్రొద్దుటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ కడప రీజనల్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మాజీ అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కేసీకెనాల్ ప్రాజక్టు కమిటీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శాకాంబరిదేవిగా రామలింగ చౌడేశ్వరి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మేదర వీధిలోని శ్రీ రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో ఆషాడమాస తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. టమాటా, బెండ, నిమ్మకాయలు, ఆకుకూరలు, పచ్చిమిర్చి తదితర కూరగాయలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి భక్తి శ్రద్ధలతో ప్రార్థించారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం, ప్రధాన కార్యదర్శి గిద్దలూరు ఈశ్వరయ్య, గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ గిద్దలూరు గంగాజలంధర్, దేవాంగ కల్యాణ మండపం కార్యదర్శి మచ్చా వెంకట సుబ్బరాయుడు, ఆలయ సెక్రటరీ గిద్దలూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ర్యాలీ, ధర్నాను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు కల్చరల్ : దళితులపై కులవివక్ష నిర్మూలన కోసం రాష్ట్ర మాలమహానాడు ఆధ్వర్యంలో కడపలో ఈ నెల 29న నిర్వహిస్తున్న ర్యాలీ, ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు వి.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ర్యాలీ, ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న ఉదయం 10 గంటలకు కడపలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ, ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు అందాల్సిన నష్టపరిహారాన్ని తక్షణమే అందించాలని, హత్యలకు గురైన కుటుంబాల్ని ప్రభుత్వమే ఆదుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్‌ల సాధన కోసం ర్యాలీ, ధర్నా చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్రమాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు సంగటి పుల్లయ్య, రాష్ట్ర సమన్వయకర్త మేకల ఏసురత్నం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబులేసు పాల్గొన్నారు.

సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ

చాపాడు: స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఇటీవల విడుదల చేసిన డిప్లొమో ఫస్టియర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలలో స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కాలేజీకి చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డా.జీ.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈసీఈ విభాగంలో బి.లాస్య 97శాతం, కె.జాహ్నవి 96.72 శాతం, కె.సుచిత 94.81 శాతం, పీవీ జశ్వంత్ రాయల్, రమ్యశ్రీ 95.36 శాతం, ఎం.గురు శ్రావ్య పూజిత 92.54 శాతం, ఎస్.రెహ మున్నీసా 90.09 శాతం, సీఎంఈలో జి.లలిత 92.80 శాతం, జి.కీర్తితేజ 91.20 శాతం, పి.స్నేహ 92.10 శాతం, ఈఈఈలో ఆర్.దినేష్‌రెడ్డి 90.80 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



మురికినీరులో బ్లీచింగ్ చల్లుతున్న వైద్య సిబ్బంది

కాశినాయన : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దారు కృష్ణలు తెలిపారు. శుక్రవారం మండలంలోని నరసాపురం గ్రామంలో పర్యటించి మురికి నీరు ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు రోడ్లపైన నీరు పోయరాదని, అలాగే బాత్‌రూమ్‌లోని నీళ్ళను కొంత మంది రోడ్లపైకి వదులుతున్నారని తెలిపారు. దీని వలన రోగాలు ప్రబలి మీకే ఇబ్బందులు కలుగుతాయన్నారు. ప్రతిఒక్కరు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పంచాయతీ సెక్రటరీ రామక్రిష్ణారెడ్డి, సర్పంచ్ వలి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులకు మెనుతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ మదుసూదన్‌రెడ్డి, తహసీల్దారు కృష్ణలు తెలిపారు. శుక్రవారం మండలంలోని నరసాపురం ఎంపీపీ పాఠశాల, మోడల్ పాఠశాలలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను భోజనం, కూరలు బాగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెను ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తామన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బి.కోడూరు : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ భాస్కర్‌రావు, బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బి.కోడూరు, మేకవారిపల్లె, తుమ్మలపల్లె పంచాయతీల్లోని ప్రజలకు వారు పారిశుద్ధ్యం పట్ల అవగాహన కల్పించి మురికినీటి గుంతల్లో బ్లీచింగ్ చల్లించి తాగునీటి వనరులను పరిశీలించి ట్యాంక్‌లను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా నీటిని నిల్వ ఉంచే ట్యాంకులు, బిందెలు తదితర వాటిలోని నీటిని పారవేసి రెండు గంటలు ఎండబెట్టిన తర్వాత నీటిని నింపుకోవాలన్నారు. దోమల వలన డయేరియా, మలేరియా వంటి వ్యాధులు వస్తాయని, దోమల నివారణకు దోమతెరలు వాడాలని సూచించారు. సీహెచ్‌ఓ నాగమణి, పీహెచ్‌ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, హెల్త్ అసిస్టెంట్లు రామతీర్థం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.